క్లుప్తంగా

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



పెనుగొండలో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసరు

పెనుగొండ: బాలలను షాపుల్లో పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం డివిజన్ అసిస్టెంట్ లేబర్ అధికారి కేబీఆర్ శర్మ అన్నారు. మంగళవారం పెనుగొండలో పలు షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, పోలీసు, విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై దోపిడీ

మొగల్తూరు: మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వాహనదారుడు మూత్ర విసర్జన కోసం ఆగగా అటువైపుగా వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు నగదు, సెల్‌ఫోన్ తీసుకుని పరారైన సంఘటన సోమవారం రాత్రి మొగల్తూరు- నరసాపురం జాతీయ రహదారిపై జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి మొగల్తూరు ఏఎస్సై బి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం జగన్నాథపురానికి చెందిన ఎం.దుర్గారావు అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై పాలల్లులోని అత్తవారింటికి బయలుదేరాడు. మొగల్తూరు నరసాపురం జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న దుర్గారావు రాత్రి 10 గంటల సమయంలో మొగల్తూరు స్టేషన్ పరిధిలోని కోతులగుంట వద్ద మూత్ర విసర్జనకు ఆగాడు. అదే సమయంలో సమీపంలోని తోటలో నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి దుర్గారావు వద్ద ఉన్న రూ.22 వేలు నగదు, సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచాలి

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని పెనుగొండ హస్పటల్స్ వైద్యులు డాక్టర్ ఎస్‌వీడీ పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం టీటీడీ కల్యాణ మండపంలో పెనుగొండ మండల కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ వెల్‌ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ వ్యాధి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. సమావేశంలో కలకత్తాలో అత్యాచారానికి గురై మరణించిన డాక్టర్ అభయకు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ శిరీష, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే చిట్టి సుభానీ, అధ్యక్షుడు పాలపర్తి శ్రీనుబాబు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో అప్రమత్తత అవసరం

పెనుగొండ: పశువుల పెంపకంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశు సంవర్ధక శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం సిద్ధాంతం పశువైద్య శాలలో పాడి పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు.గాలి కుంటి వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుందని, పాలు తాగే దూడలు మరణిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భానుతేజ, లంకల సొసైటీ అధ్యక్షుడు చింతపల్లి జేమ్స్, వెన్నపు వెంకటేశ్వరరావు, తానేటి మదన్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 18 సంవత్సరాలు దాటిన వ్యక్తులు, మధ్యలో విద్యను ఆపేసిన వాళ్లు ఓపెన్ స్కూల్లో చదువుకోవచ్చని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎంకెఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే సార్వత్రిక విద్యాపీఠం అడ్మిషన్లపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 ఆర్ఎస్ఎస్‌వీజీ శర్మ, హెచ్ఎం ఏఎస్‌వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లేసుపార్కు ఎన్నిక వాయిదా

నరసాపురం రూరల్: నరసాపురం లేసు పార్కు ఎన్నిక వాయిదా పడినట్లు లేసు పార్కు మేనేజర్ కుసుమకుమారి మంగళవారం తెలిపారు. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23న సీతారామపురం లేసుపార్కు ఎన్నిక జరగాల్సి ఉంది. దీనిలో భాగంగా ముందుగా పార్కు పరిధిలోని 51 గ్రామాల్లోని సొసైటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ 38 సొసైటీలలో ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని, ఇంకా 13 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో సమయాభావం వల్ల లేసుపార్కు ఎన్నికను వాయిదా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ తేదీను త్వరలో తెలియజేస్తామని వివరించారు.

కొడమంచిలిలో కంటి వైద్య శిబిరం

పెనుగొండ: కొడమంచిలి అరుంధతీ పేట సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మంగళవారం ఉచంది కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన సిద్ధార్థ నర్సింగ్ బుద్ధుడు కంటి వైద్య ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 70 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర సీతారామ్, డాక్టర్ టి.ఆనందకుమార్, పాస్టర్ పి.రత్నం, కొండేటి వర ప్రసాద్, పల్లేరు రమేష్ పాల్గొన్నారు.

వేప ఉత్పత్తులతో పంటలు సురక్షితం

ఖర్చు మితం ఆదాయం అపరిమితం



వేప చెట్టు

పాలకొల్లు సెంట్రల్: ఔషధ గుణాలు కలిగిన వేప వల్ల ఇటు మానవాళితో పాటు అటు వివిధ పంటలకు సురక్షితమైన ఔషధంగా దోహదపడుతుంది. వేప చెట్టులో వేరు, బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలతో సహా అన్ని భాగాలు ఔషధ గుణాలు ఉండడంతో ఎంతో మేలు జరుగుతుంటుంది. ఎక్కువ మంది రైతులు వ్యాపారస్తుల మాటలు నమ్మి పురుగుమందులు, ఎరువులు అధికంగా వాడడమే అలవాటుగా మార్చుకున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే పండించే పంటల్లో ఖర్చు తగ్గుతుంది. అలాగే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. అంతే కాకుండా సాగు చేసే నేల సారవంతంగా కూడా ఉంటుంది. తద్వారా ఆరోగ్య కరమైన ఆహార పంటలను అందించవచ్చు. వేప ఉత్పత్తులపై అగ్రికల్చరల్ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

వేపతో కీటకాల నాశనం

వేప పిండి, వేపనూనె, వేప కషాయం వివిధ రకాల పద్ధతుల్లో మార్కెట్లో అందుబాటుల్లో లభిస్తుంది. వేపలో అజాడిరాక్టిన్ అనే అనుకూల పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లజాతి పురుగులు. చెదలు, భూమిలోని నెమతోడ్సు, కొన్ని రకాల బూజు శిలీంద్రాల్ని అరికట్టే శక్తి ఉంటుంది. ఇది వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్లమొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటల్లో వచ్చే కీటకాలను అరికడుతుంది.

వేప ఉత్పత్తుల వల్ల జరిగే మేలు ఇదే

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వాడితే కీటకాలు పెరుగుదలను అరికడుతుంది. ఈ మందు స్ప్రే చేసినప్పుడు పురుగులకు వికారం కలిగించి పైరును తినకుండా చేస్తుంది. ఈ మందు వల్ల పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనే టీగలు వంటి జీవాలకు హాని కలగకుండా ఉంటుంది. సీతాకోక చిలుకలు, తల్లి రెక్కల పురుగులు పెట్టిన గుడ్లు పొదగక ఎక్కువ శాతం చనిపోతాయి. సమగ్ర సస్య రక్షణ విధానంలో ఈ మందులు బాగా ఉపయోగపడతాయి. ఒక మాదిరి వేడి వాతావరణం వల్ల ఈ మందులు నిరుపయోగం కాకుండా ఉంటాయి. అలా అని అధిక ఉష్ణోగ్రతలో పిచికారి చేయడం వల్ల మందు ప్రభావం తగ్గిపోతుంది. పురుగు మందులు, శిలీంద్ర నాశినులతో కలిపి సురక్షితంగా స్ప్రే చేసుకోవచ్చు.

పిచికారీకి అనుకూల సమయం

పైరుపై పురుగు ఆశించిన వెంటనే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచి పలితం కనిపిస్తుంది. ఎకరాకు మూడు నుంచి ఐదు మిల్లీ లీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో, ఏడు నుండి 15 రోజుల వ్యవదిలో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తరువాత ఆరు గంటల వ్యవధిలోపు వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సి ఉంటుంది.

వివిధ పంటల్లో తెగుళ్ల నివారణ....

వేప మందుల వాడకంతో వివిధ రకాల పంటల్లో పలు రకాల చీడపీడలను నివారించుకోవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం వల్ల కాండం తొలిచే పురగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి మూడు మిల్లీ లీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమికుళ్లు, పొడలెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. ఐదు శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిర్చి వీద వచ్చే జెమినీ వైరస్ తెగులు అదుపులో ఉంటుంది.

ఇంట్లోనే కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంటిలోనే తయారు చేసుకోవచ్చు. ఐదు కిలోల వేప గింజలు నలగగొట్టి ఆరు నుంచి ఏడు లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి, మరో వంద లీటర్ల నీటిని అందులో కలపాలి.

వేపతో బోలెడు లాభాలు



వేప చెక్కలో నత్రజని 5.6 శాతం, భాస్వరం 1.1 శాతం, పోటాష్ 1.4 శాతం వేపపిండిలో నత్రజని 2–3 శాతం భాస్వరం 1.0 శాతం పొటాష్ 1.4 శాతం చొప్పున పోషక విలువలు ఉన్నాయి. వీటితో పాటు పశువుల ఎరువులను ఉపయోగిస్తే పంటలకు మేలు కలుగుతుంది. వేప గింజల నుండి నూనె తీయగా వచ్చిన వేప చెక్క, ఎండిన వేపకాయల్ని దంచగా వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి పంట, నిమ్మ తోటలకు వాడకోవచ్చు. వేప ఉత్పత్తులను వాడి రైతులు మంచి ఫలితాలు పొందవచ్చు.

– ఎం.శామ్యూల్ జాన్సన్, ఏఓ, పాలకొల్లు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మునకాల చిట్టియ్య (60) వృద్ధుడు మృతి చెందాడు. మంగళవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక చింతల తోటకు చెందిన చిట్టియ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిత్యం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుని వెళుతున్నాడు. ఈ నెల 16న ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గాయాలతో ఉన్న చిట్టియ్యను ఆసుపత్రి సిబ్బంది గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి చిట్టియ్యను విచారించగా తనకు అనారోగ్యంగా ఉందని తనను బంధువులు ఎవ్వరూ పట్టించుకోవడంలేదని మనస్తాపానికి గురై నా శరీరాన్ని గాయపరుచుకున్నానని తెలిపాడన్నారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధ దంపతులకు మందుల వితరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని చందపర్రుకి చెందిన బొందా నతానియేలు – మార్తమ్మ దంపతులు గుండె, కీళ్ల వ్యాధుల నొప్పులతో బాధపడుతున్నారు. కనీసం మందులు కొనుగోలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వాకర్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు దృష్టికి స్థానికులు తీసుకురావడంతో రూ.6 వేలు విలువైన మందులను వితరణ చేశారు. మంగళవారం వీటిని నతానియేలు, మార్తమ్మ దంపతులకు అందజేశారు. మాజీ సర్పంచ్ రాపాక విజయరత్నం, మాజీ ఉపసర్పంచ్ విల్లూరి రత్నరాజు, క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమలు దూరం



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

మొగల్తూరు: దోమలు నివారణకు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ లక్ష్మీ పార్వతి సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం మొగల్తూరు గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ ఆడ ఎనోఫిలిస్ దోమ కారణంగా మలేరియా వ్యాధి వ్యాప్తిస్తుందని 1897వ సంవత్సరంలో సర రోనాల్డ్ రోస్ కనుగొన్నారని, ఆయనను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాదీ ఆగష్టు 20న దోమల దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



యలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యలమంచిలి: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రభుత్వ శాఖల అధికారులంతా సమన్వయంగా పనిచేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె బేటీ బచావో-బేటీ పఢావో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా చైల్డ్ మేరేజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ టీంలో ఉన్న ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, పోలీస్, అంగన్‌వాడీ, మండల సమాఖ్య అధికారులంతా కలిసి పనిచేస్తే బాల్య వివాహాలను సమర్థంగా అరికట్టవచ్చన్నారు. గ్రామాలలో ఆయా శాఖల సిబ్బంది ద్వారా బాల్య వివాహాల సమాచారాన్ని తేలిగ్గా సేకరించవచ్చన్నారు. తద్వారా బాల్య వివాహాలను సమర్థంగా అడ్డుకోవచ్చన్నారు. అంతకన్నా ముందుగా ప్రతి పాఠశాలలోను, డ్వాక్రా మహిళల సమావేశాల్లోను, పబ్లిక్ మీటింగ్స్‌లోను బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా కూడా బాల్య వివాహాలను ఆపవచ్చన్నారు. అనంతరం బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఎంఈఓ కనుమూరు రామకృష్ణంరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ పి.నాగరత్నం, సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య ఇబ్బందులు



చినమామిడిపల్లిలో అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల కారణంగా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సదరు స్థలాల యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకు పోయి, దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. పట్టణంలో స్టేషన్ పేట, రుస్తుబాద, చినమామిడిపల్లి, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, చలువ పేట, ఎన్టీఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, నందమూరి కాలనీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలన్నీ ఇళ్ల మధ్యే ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోతున్నాయి. అలాగే చెత్త చెదారం చేరి దోమలు పెరిగిపోతున్నాయి. పట్టణంలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలలు ఉన్నాయే గుర్తించి, ఆ స్థలాలు పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలి. కానీ అలాంటి చర్యలేవి పట్టణంలో కానరావడం లేదు. కొన్ని నెలల క్రితం ఇలాంటి స్థలాల్లో మునిసిపాలిటీ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. తరువాత ఈ అంశాన్ని వదిలేశారు. పట్టణంలో మొత్తంగా 250 వరకూ ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోస్టల్ శాఖలో ఫిలాటలీ స్కాలర్‌షిప్ స్కీమ్

పాలకొల్లు సెంట్రల్: పోస్టల్ శాఖ నిర్వహించే ఫిలాటలీ స్టాంప్ కలెక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించే విధానంలో భాగంగా దీన్ దయాళ్ స్పర్శ్ యోజనా 2024 ఫలాటలీ స్కాలర్ షిప్ పథకాన్ని అమలు చేయనున్నట్లు భీమవరం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎస్ వి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో 6వ తరగతి నుండి 9 వ తరగతి చుదువుకునే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులు సాధించి ఉండాలని, మార్కుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం రాయితీ ఉంటుందని వివరించారు. ప్రతి తరగతి నుంచి 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇలా నాలుగు తరగతుల నుండి 40 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి పిలాటలీ స్కాలర్‌షిప్‌లు అందిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 500 చొప్పున సంవత్సరానికి రూ. 6 వేలు దీన్ దయాళ్ స్పర్శ్ యోజనా ఫిలాటలీ స్కాలర్ షిప్‌లు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక రెండు విభాగాలుగా ఉంటుందని, మొదటి విభాగంలో సెప్టెంబర్ 30న రీజనల్ స్థాయిలో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 50 ప్రశ్నలకు 50 మార్కులు మల్టీపుల్ చాయిస్ ఉంటుందని వివరించారు. కరెంట్ అఫైర్స్, హిస్టరీ, సైన్స్, స్పోర్ట్స్, జాగ్రఫిల్లో ఒక్కో సబ్జెక్టుకు 5 మార్కులు చొప్పున, లోకల్ ఫిలాటలీలో 10 మార్కులు, నెషనల్ ఫిలాటలీలో 15 మార్కులు చొప్పున నిర్ణయిస్తారని పేర్కొన్నారు. రెండవ విభాగంలో మొదటి విభాగంలో ఉత్తీర్ణులైన వారికి ఫిలాటలీ ప్రాజెక్టు పరీక్ష నిర్వహిస్తారని, దీనిలో 5 పేజీలు, 500 పదాలు, 16 స్టాంపులు మించకుండా ఒక ప్రాజెక్టు సిద్ధం చేయాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తు చేసుకునే విధానం పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొంటారో వారి పేర్లను నమోదు చేసి స్కూల్ నుంచి పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ, 520003 వారికి ఫిలాటలీ పోస్టల్ స్టాంప్స్ అతికించి సెప్టెంబర్ 16 లోపు చేరేలా పంపించాలని సూచించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



మొగల్తూరు: ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



యలమంచిలి: శిరగాలపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి

మొగల్తూరు: తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించి వాటి ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసుకుని పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచుకోవాలని మాస్టర్ ట్రైనీ, ఈఓపీఆర్డీ నవీన కిరణ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మంగళవారం రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలోని వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీ నవీన కిరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, మాస్టర్ ట్రైనీలు కేఐఎస్ రాజు, వై.కృష్ణ, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాలతో బహుళ ప్రయోజనాలు

యలమంచిలి: చెత్త సేకరణ కేంద్రాలలో కంపోస్టు ఎరువును తయారు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి చెప్పారు. శిరగాలపల్లి గ్రామంలోని చెత్త సేకరణ కేంద్రం వద్ద మంగళవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో జరిగిన పునశ్చరణ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామంలో సేకరించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రానికి తరలించడం వల్ల గ్రామాలు శుభ్రపడతాయన్నారు. సేకరించిన చెత్తతో కంపోస్టు ఎరువు తయారుచేసి విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం పెరగుతుందన్నారు. తయారైన కంపోస్టు ఎరువు వినియోగించి పండించిన పంటలను తినడం వల్ల ప్రజలకు ఆరోగ్యానికి మేలు జరుగుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్, గ్రామ కార్యదర్శులు పీతల రాజశేకర్, అడబాల కోదండరామయ్య, మాదాసు హరిప్రసాద్, తోలేటి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై అలరించిన నృత్య ప్రదర్శనలు



కూచిపూడి విద్యార్థులకు జ్ఞాపికలు ఇస్తున్న విజయవాడ కనకదుర్గ ఆలయ అధికారులు

నరసాపురం: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ధర్మపథం వేదికపై నరసాపురం శ్రీఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఏపీ రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనల్లో ఆదిపరాశక్తి నృత్యనికేతనం ప్రిన్సిపాల్, నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మీదేవి శిష్యులు 30 మంది నాట్యప్రదర్శనలు ఇచ్చారు. దుర్గాదేవి నృత్య రూపకం, శివ పంచాక్షరి, లింగాష్టకం, అష్టలక్ష్మీ వైభవం తదితర నృత్యరూపకాలకు విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయని అనంతలక్ష్మీదేవి చెప్పారు. ఆలయ ఈఓ కేఎస్ రామారావు విద్యార్థులు చిన్మయి, పద్మ, వినయ, ప్రణవి, సరస్వతి, జాహ్నవి, యోగ్య, అనన్య, మాన్విత, అంజలి తదితరులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందించారు.

అనధికార లే అవుట్ల జాబితా విడుదల



అనధికార లేఅవుట్ల జాబితా నోటీసు బోర్డులో పెడుతున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ ఉన్న అనధికార లేఅవుట్ల జాబితాను మంగళవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డులో జాబితా ఉంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు చేపట్టామని చెప్పారు. పట్టణంలో ఉన్న మొత్తం అనధికార లేఅవుట్లను గుర్తించామని చెప్పారు. చట్టవిరుద్ధంగా ఈ లేఅవుట్స్‌లో ప్లాట్లు అమ్మకాలు చేసినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ లేఅవుట్లలో విద్యుత్, డ్రెయిన్స్, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించమని చెప్పారు. బిల్డింగ్ ప్లాన్స్ ఇవ్వబోమని వివరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని చెప్పారు.

నేడు చందపర్రులో ఆక్వా రైతులు, డీలర్ల సదస్సు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చందపర్రు ఎస్ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం ఉదయం 10గంటలకు ఆక్వా రైతులు, డీలర్లతో సదస్సు నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖాధికారి ఎల్ఎల్ఎన్ రాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆక్వా సాగు చేస్తున్న రైతులు సదస్సుకి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

భారత్ బంద్‌కు సహకరించాలి



కొడమంచిలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

నరసాపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని మాలల న్యాయ పోరాట సమితి నరసాపురం నియోజకవర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనంద్, ఉపాధ్యక్షుడు కొల్లాబత్తుల రవి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పును పునరాలోచన చేయాలని, మాలలకు న్యాయం చేయాలని కోరాఉరు.

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణ క్రీమీలేయర్ సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర సీతారామ్ మాల కోరారు. మంగళవారం కొడమంచిలి పంచాయతీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆచంట మండలంలో వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహానాడు నాయకులు పుచ్చకాయల నాగార్జున, బొరుసు రాంబాబు, పాలుమూరి శేఖర్ బాబు, జిత్తుక మురళీ, సాక సురేష్ పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి


మొగల్తూరు: వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాల మహానాడు మరియు ఇతర సంఘాలు కలిసి బుధవారం చేపట్టనున్న బంద్ కు సహకరించాలని మాల మహానాడు మండల అధ్యక్షులు ఇంజేటి కుమార స్వామి కోరారు. మంగళవారం మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ నిరంజన్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంజేటి దానం, కొల్లాబత్తుల రాంపండు కాకిలేటి ఆనంద్ కుమార్, పడవల సత్యనారాయణ, సుధీర్, గూడపాటి రమేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం ఇచ్చిన భారత్ బంద్‌కు పాలకొల్లులో అన్ని విద్యాసంస్థలు మూసివేసి సహకరించాలని మాల మహనాడు నాయకులు ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, పలువురు మాలమహానాడు నాయకులు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లోని అన్ని అనుబంధ సంఘాలకు, అలాగే బ్యాంకులకు, ఇతర వర్తకులకు వినతిపత్రాలు అందజేశారు.



మొగల్తూరులో ఆర్ఐకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు



పాలకొల్లు ఎంఈఓ వీరాస్వామికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం